షెడ్లు కట్టండి.. బిల్లులకు ఆగండి..!

మినీ గోకులం షెడ్లు పూర్తయినా అందని బిల్లులు

లబ్ధిదారులకు తప్పని ఎదురుచూపులు





ఈ చిత్రంలో కనిపిస్తున్న మినీ గోకులం షెడ్డు అనంతపురం రూరల్ మండలం పూలకుంటలోనిది. లబ్ధిదారురాలు లక్ష్మీ దేవి.. సంబంధిత అధికారుల సూచనల మేరకు నిర్మించుకుంది. జనవరిలోనే నిర్మాణం పూర్తయింది. సంకాంత్రి పండుగ సంబరాల్లో భాగంగా షెడ్డును ప్రారంభించారు. బిల్లులు మాత్రం నేటికీ అందలేదు. దీంతో లబ్ధిదారురాలికి ఎదురుచూపులు తప్పట్లేదు.

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రైతులను దృష్టిలో ఉంచుకుని సబ్సిడీతో మినీ గోకులం షెడ్ల నిర్మాణం చేపట్టింది. ఆ మేరకు రైతులు షెడ్ల నిర్మాణానికి ఆసక్తి చూపారు. షెడ్లు మంజూరైన రైతులు చకచకా నిర్మాణం చేశారు. ఇందుకు సంబంధిత అధికారులు ఒత్తిళ్లు కూడా కారణమే. నిబంధనల ప్రకారమే షెడ్లు నిర్మించుకున్నారు. షెడ్ల నిర్మాణానికి సంబంధించిన సామగ్రికి రూ.లక్షలు ఖర్చు చేసుకున్నారు. అప్పులు చేసి కట్టుకున్నారు. నేటికీ బిల్లులు మాత్రం అందక ఇబ్బందులు పడుతున్నారు. షెడ్ల నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా.. బిల్లుల కోసం ఎదురు చూడటమే వారి వంతవుతోంది.

పెండింగ్‌లో రూ.60 లక్షల బిల్లులు

రూరల్ మండలంలో గోకులం షెడ్లకు పెద్దఎత్తున రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఆరు పశువుల షెడ్ల నిర్మాణానికి ఆసక్తి చూపారు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.2.30లక్షలు కేటాయించారు. ఇందులో ఉపాధి హామీ నిధులు రూ.2.07 లక్షలు కాగా.. రైతు వాటా కింద రూ.23 వేలు చెల్లించాల్సి ఉంటుంది. మండలానికి 43 షెడ్లు మంజూరయ్యాయి. రైతులు నిబంధనల ప్రకారం సామగ్రిని కొనుగోలు చేసి, నిర్మాణాలు చేసుకున్నారు. ఇప్పటికే మండలవ్యాప్తంగా 29 షెడ్లు పూర్తయ్యాయి. గత నెలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండల అధికారులు వాటిని ప్రారంభించారు. బిల్లులు మాత్రం నేటికీ అందలేదని రైతులు వాపోతున్నారు. బిల్లులు ఎప్పుడు మంజూరవుతాయోనన్న ఆందోళనలు రేకెత్తుతున్నాయి.

పూర్తయిన షెడ్ల వివరాలిలా..

మండలానికి 43 షెడ్లు మంజూరు కాగా.. ఇప్పటి వరకు 29 పూర్తయ్యాయి. కందుకూరులో అత్యధికంగా ఐదు, నరసనాయని కుంట, ఆకుతోటపల్లి, తాటిచెర్ల, కామారుపల్లిలో మూడు చొప్పున, కురుగుంట, పూలకుంట, మన్నీల, కొడిమి గ్రామాల్లో రెండేసి, చిన్నంపల్లి, సోములదొడ్డి, రాచానపల్లి, ఉప్పరపల్లిలో ఒక్కొక్కటి నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలినవి బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నట్లు సంబంధిత అధికారుల ద్వారా తెలుస్తోంది.



మన్నీలలో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న మండల అధికారులు

బిల్లులు సిద్ధం చేసి ఉంచాం..



మండలంలో పూర్తయిన మినీ గోకులం షెడ్లకు సంబంధించిన బిల్లులన్నీ సిద్ధం చేశాం. స్లాట్ ఓపెన్ కాకపోవడంతో సమస్య ఏర్పడింది. స్లాట్ ఓపెన్ అవ్వగానే బిల్లులు పడే వీలుంది. త్వరలోనే లబ్ధిదారులకు బిల్లులు మంజూరయ్యే అవకాశం ఉంది.

- దివాకర్, ఎంపీడీఓ, అనంతపురం రూరల్ మండలం



టాంటాం ఆటోలను ప్రారంభిస్తున్న ఎస్పీ

అందరికీ తెలిసేదహో..!

సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సిద్ధం చేసిన టాంటాం ఆటోలను డీపీఓలో ఎస్పీ జగదీష్ శనివారం ప్రారంభించారు. సైబర్ సురక్షలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టామని ఆయన తెలిపారు. ఈ నెల 13న మూడు డిజిటల్ వాహనాలను ప్రారంభించామని తెలిపారు. సైబర్ మోసాలు జరిగే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వీడియోలను ప్రదర్శిస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్నామని అన్నారు. తాజాగాటాం టాం ఆటోలను జిల్లా అంతటా తిప్పాలని నిర్ణయించామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా శనివారం ఒక్కరోజే 70 ఆటోలను పంపామని తెలిపారు. అన్నివర్గాల ప్రజలలో చైతన్యం నింపడమే తమ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమణమూర్తి, డీఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్ రెడ్డి, సీఐలు ధరణికిషోర్, రాజేంద్రనాథ్‌యాదవ్, శ్రీకాంత్‌యాదవ్, శాంతిలాల్, కనుమూరి సాయినాథ్, శేఖర్, రఘుప్రసాద్, ఆర్ఐ రాముడు తదితరులు పాల్గొన్నారు. - ఆంధ్రజ్యోతి, అనంతపురం క్రైం

పరిశుభ్రత.. అందరి బాధ్యత :కలెక్టర్



ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పామిడి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని వంకరాజుకాలువ గ్రామంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ నిర్వహించారు. గ్రామ శివారులో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. మొక్కను నాటి నీరు పోశారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. తడిచెత్త, పొడిచెత్త ఏయే డబ్బాల్లో వేయాలని మహిళలను అడిగారు. సరైన జవాబు చెప్పినవారికి చీరలను కానుకగా అందజేయాలని అధికారులకు సూచించారు. గ్రామాన్ని శుభ్రపరుస్తున్న పారిశుధ్య కార్మికులను సత్కరించారు. గ్రామం పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తంచేశారు. స్వచ్ఛ దివస్‌పై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్, డ్వామా పీడీ సలీమ్ బాషా, జడ్పీ సీఈఓ రామచంద్రా రెడ్డి, డీపీఓ నాగరాజునాయుడు, డీఎల్‌డీఓ విజయలక్ష్మి, ఎంపీడీఓ తేజోత్న్స, తహసీల్దారు శ్రీధరమూర్తి, సర్పంచు లక్ష్మీదేవి, ఎంపీటీసీ సువర్ణ పాల్గొన్నారు.

కాయని కంది

వైసీపీ హయాంలో నాసిరకం విత్తనాలు సరఫరా

పరిహారం ఇవ్వాలని బాధిత రైతుల డిమాండ్



కాపులేని కంధిపంట

డీ.హీరేహాళ్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం సరఫరా చేసిన నాసిరకం కంది విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. డి.హీరేహాళ్ మండల పరిధిలోని ఎం హనుమాపురం గ్రామ రైతులు గత ఏడాది ఏప్రిల్, మేలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎల్ఆర్‌జీ 52 రకం కంది విత్తనాన్ని కొనుగోలు చేశారు. సుమారు 15 మంది రైతులు 80 ఎకరాలలో పంట సాగు చేశారు. పూతదశకు వచ్చేవరకు ఎకరానికి రూ.15 వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. పూత కాయగా మారకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. ఒక్కో రైతు రూ.లక్ష నుంచి రూ.4 లక్షల దాకా పెట్టుబడి కోల్పోయారు. వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగానే నాసిరకం విత్తనాల పంపిణీ జరిగిందని బాధిత రైతులు లీలావతి, పార్వతమ్మ, గోవిందరెడ్డి, కృష్ణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, శేఖర్‌గౌడ్ తదితరులు ఆరోపించారు. నాసిరకం విత్తనాలను సరఫరా చేసినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తమకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



కందిపంట నష్టపోయిన రైతులు

సైబర్ మోసాలతో జాగ్రత్త

జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ సూచించారు. ఐసీఐసీఐ బ్యాంకు సౌజన్యంతో జిల్లా ప్రధాన కోర్టు హాల్‌లో న్యాయాధికారులు, కోర్టు సిబ్బందికి సైబర్ నేరాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలిసో తెలియకో ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో సైబర్ క్రైం సమస్యను ఎదుర్కొంటున్నారని అన్నారు. అప్రమత్తంగా ఉంటే ఈ సమస్య నుంచి బయటపడవచ్చని అన్నారు. అనంతరం బ్యాంకు ఆర్ఎం, మేనేజర్లు, సాంకేతిక సిబ్బంది సైబర్ క్రైమ్ మోసాలు, జాగ్రత్తల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో పోక్సో కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి, అదనపు సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి నిర్మల, ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి పావని, జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, కోర్టు మేనేజర్ మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆడుతాం.. పాడుతాం..!
బాలోత్సవాలలో అదే ఉత్సాహం (6లో...)

జాతకం బాగలేదు..! 7

భక్తి శ్రద్ధలతో మహాభోగ్
ముగిసిన సేవాలాల్ జయంత్యుత్సవాలు (6లో...)

అనంతను ఆదర్శంగా నిలుపుదాం

ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు

26 మందికి ఉత్తమ డ్రైవర్ అవార్డులు


అవార్డులను అందుకున్న డ్రైవర్లతో ముఖ్య అతిథులు, ఆర్టీసీ అధికారులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణలో అనంతపురం జిల్లాను ఆదర్శంగా నిలుపుదామని ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు పిలుపునిచ్చారు. అనంతపురం డిపో ఆవరణలో శనివారం సాయంత్రం రీజనల్ మేనేజర్ సుమంత్ అధ్యక్షతన రోడ్డుభద్రతా వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కు పూల నాగరాజు, అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్టీఓ సురేష్‌నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పూల నాగరాజు మాట్లాడుతూ... రాష్ట్రంలో ఏడాదికి దాదాపు 8వేల మంది రోడ్డు ప్రమాదాల కారణంగా మృతి చెందుతుండగా 25వేల మందికి పైగా గాయపడుతున్నారన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో ఆర్టీసీ బస్సు ప్రమాదాలు చాలా తక్కువని, దీనికి డ్రైవర్లకు ఆర్టీసీ ఇచ్చే శిక్షణే కారణమన్నారు. రోడ్డుభద్రతా నియమాలను తూచా తప్పకుండా పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయన్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో రోజురోజుకీ వాహనాల సంఖ్య పెరుగుతోందని, వాహనాల సంఖ్యతోపాటు ప్రమాదాలు పెరిగే అవకాశముందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అప్రమత్తత వహిస్తే తప్ప ప్రమాదాలను నివారించలేమన్నారు. కార్యక్రమంలో పీఓ చెంద్రాయుడు, డిప్యూటీ సీటీఎం శ్రీలక్ష్మి, అనంతపురం డిపో మేనేజర్ నాగభూపాల్, రీజియన్‌లోని అన్ని డిపోల డీఎంలు, బస్టాండు మేనేజర్ కేఎస్ మూర్తి, ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డులు పొందిన డ్రైవర్లు వీరే...

జోనల్ స్థాయిలో..:	ఎం.ప్రసాద్ (తాడిపత్రి), జీకే మొహిద్దీన్ (అనంతపురం)
రీజియన్ స్థాయిలో.. :	కేవీ రాముడు(తాడిపత్రి), బీఆర్ ఆంజనేయులు(అనంతపురం), జి.వెంకటేష్(కళ్యాణదుర్గం)

డిపోలవారీగా..

డిపో పేరు	డ్రైవర్ పేరు
అనంతపురం	ఎస్ఎం బాషా, జేఎస్ రాములు, కేవి సాహెబ్
గుత్తి	కె.రాజు, ఎంఆర్ గోపాల్, ఎస్ రహిమాన్
గుంతకల్లు	బి.బాలస్వామి, హెచ్‌కే పీరా, వైకే మూర్తి
కళ్యాణదుర్గం	టీవీ రమణ, ఎస్ఆర్ క్రిష్ణ, బీఎస్ఆర్ రెడ్డి
రాయదుర్గం	వి. శేఖర్, డీజీ నాయక్, పి. రామాంజిని
తాడిపత్రి	డి. మోహన్, పి తిరుపతయ్య, ఎంబీ నారాయణ
ఉరవకొండ	ఎ. వెంకటేశులు, యం.రామదాస్, ఎంసీ రంగస్వామి

భక్తి శ్రద్ధలతో మహాభోగ్

ముగిసిన సేవాలాల్ జయంత్యుత్సవాలు


అలంకరణలో సేవాలాల్ మహరాజ్


ఎంపీ అంబికా, కలెక్టర్‌ను సన్మానిస్తున్న ట్రస్టు సభ్యులు


మహాభోగ్ కార్యక్రమం నిర్వహిస్తూ..

గుత్తి రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సేవాలాల్ జయంత్యుత్సవాలు శనివారం ముగిశాయి. స్వామివారికి శనివారం వేకువజామున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకిలో కొలువుదీర్చి ఊరేగించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన సేవాలాల్ మాలధారులు ఇరుముడులను సమర్పించారు. మాతాజగదాంబ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయం నుంచి 101 మంది యువతులు బోనాలను తీసుకువెళ్లి సేవాలాల్ మహారాజ్‌కు సమర్పించారు. పీఠాధిపతి రాజేంద్ర ప్రసాద్ గురూజీ నేతృత్వంలో ముగింపు ఉత్సవాల్లో అత్యంత కీలకమైన మహాభోగ్‌ను బంజారాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ చివరి రోజు వేడుకలలో పాల్గొన్నారు. ఉత్సవాలను విజయవంతం చేసిన అధికారులను అభినందించారు. సేవాలాల్ మహారాజ్‌కి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు, ఉపాధ్యక్షులు కేశవనాయక్, రవీంద్ర నాయక్, సభ్యులు ఆశ్వత్థనాయక్, ఎకే రామచంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.


ఇరుముడి తీసుకెళుతున్న మాలధారులు


మాయమైపోలేదు.. జానపదం..




ఉత్తమం.. ఉమ్మడి కుటుంబం

వెయ్.. చిందెయ్..


రెండు కళ్లనూ కట్టిపడేసేలా...






పోలా.. అదిరిపోలా..

బాలోత్సవాలలో అదే ఉత్సాహం

ఆహూతులను కట్టిపడేసిన ప్రదర్శనలు

ఆడుతాం.. పాడుతాం..!


అమ్మోరు తల్లో....






రంగు రంగుల వేషధారణలు..


భోజనం వడ్డిస్తున్న హెచ్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత హనుమంతరెడ్డి, సీపీఎం రాష్ట్ర నాయకుడు రాంభూపాల్, జిల్లా కార్యదర్శి నల్లప్ప తదితరులు

బాలోత్సవాలలో రెండో రోజు అదే ఉత్సాహం కొనసాగింది. లలితకళా పరిషత్, గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్ ప్రాంగణాలలో వందలాది మంది బాలలు శనివారం రెండో రోజు ఆటపాటలతో అలరించారు. అలుపు సొలుపు లేకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు పోటాపోటీగా నృత్య, నాటక ప్రదర్శనలు ఇచ్చారు. ఏకపాత్రాభినయాలు, షార్ట్‌ఫిల్మ్ విశ్లేషణలు ఆలోచింపజేశాయి. వ్యాస రచన, మ్యాప్, వక్తృత్వ, క్విజ్ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్సవాలను తిలకించేందుకు నగరవాసులు తరలివచ్చారు. ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు షమీమ్ షఫివుల్లా అధ్యక్షతన కెనరాబ్యాంకు రీజనల్ ఏజీయం లారెన్స్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతిభ చాటిన బాలలకు అతిథులు బహుమతులను అందజేశారు. వేడుకలలో పాల్గొన్న సుమారు 2,500 మందికి హెచ్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత హెచ్ హనుమంతరెడ్డి భోజనం సమకూర్చారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు రాంభూపాల్, జిల్లా కార్యదర్శి నల్లప్ప, బాలోత్సవ కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి ఐద్వా సావిత్రితో ఆయన చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు భోజనం వడ్డించారు. చిన్నారులకు ఆనందాన్ని కలిగించే ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించాలని, తమవంతు సహకారం అందిస్తామని హనుమంతరెడ్డి అన్నారు.

\- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్, క్లాక్ టవర్








పాత్ర ఏదైనా.. జీవించేస్తాం..

దానిమ్మ రైతుకు

ధరల పంట..!



రూ.1.40 లక్షల వరకు పలుకుతున్న టన్ను

తోటల వద్దే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

అన్నదాతల్లో ఆనందం


మర్తాడులో సాగుచేసిన దానిమ్మ తోట

దానిమ్మ రైతు ఇంట ధరల పంట పండింది. అనూహ్య ధరలతో అన్నదాతపై సిరుల వర్షం కురుస్తోంది. టన్ను ఏకంగా రూ.1.40 లక్షల వరకు ధర పలుకుతుండడంతో రైతులు లక్షాధికారులవుతున్నారు. తోటల వద్దకే వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తుండడంతో అన్నదాతల ఆనందానికి అవధుల్లేవు. అప్పుల నుంచి బయటపడతామని సంబరపడుతున్నారు.

\- ఆంధ్రజ్యోతి, గార్లదిన్నె

పెరిగిన దానిమ్మ సాగు


మర్తాడులో కోసిన దానిమ్మ పండ్లు

గార్లదిన్నె అంటేనే టక్కున గుర్తుకొచ్చేది చీనీ సాగు. రాష్ట్రంలోనే చీనీ సాగుకు మండలం ప్రత్యేక గుర్తింపు పొందింది. మండల రైతులు మాత్రం రెండేళ్లుగా దానిమ్మ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. గార్లదిన్నె, మర్తాడు, ముకుందాపురం, యర్రగుంట్ల, జంబులదిన్నె, తిమ్మంపేట, కొప్పలకొండ తదితర గ్రామాల్లో రైతులు దానిమ్మ పంట పెడుతున్నారు. మండలవ్యాప్తంగా సుమారు 500 ఎకరాల్లో సాగు చేశారు. ఇందులో సగానికి పైగా పంట దిగుబడి వస్తున్నట్లు తెలుస్తోంది. పదిరోజుల క్రితం వరకు టన్ను రూ.80వేల నుంచి రూ.90వేల వరకు ధర ఉండేది. ప్రస్తుతం ఆ ధర మరింత పెరిగింది. ప్రస్తుతం టన్ను రూ.1.40 లక్షల వరకు పలుకుతోంది.

తోటల వద్దకే వ్యాపారులు..

గతంలో దిగుబడులు ఆశాజనకంగా వచ్చినా ధరలు లేకపోవడంతో పంటను విక్రయించుకోవడానికి రైతులు ఇబ్బందులు పడేవారు. వ్యాపారుల వద్దకు వెళ్లేవారు. దీంతో రైతులకు మార్కెటింగ్, రవాణా ఖర్చులు తడిసి మోపెడయ్యేవి. ప్రస్తుతం మార్కెట్‌లో దానిమ్మకు ధర ఉండడంతో వ్యాపారులే.. రైతుల వద్దకు వస్తున్నారు. కాయలు నాణ్యతగా, సైజు బాగా ఉంటే రైతుల పంట పండినట్లే. రాజస్థాన్, మహారాష్ట్ర, కర్ణాటక, కోయంబత్తూరు తదితర ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో దానిమ్మ దిగుబడి తగ్గిపోయింది. జిల్లాలో ఈ ఏడాది దానిమ్మకు వైరస్ సోకలేదు. అక్కడక్కడా సోకినా రైతులు కాపాడుకున్నారు. మేలైన దిగుబడులు సాధించారు. ధర కూడా ఆశాజనకంగా ఉంది. ధరలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక్కడ పండే దానిమ్మ విజయవాడతోపాటు చెన్నై, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

కష్టాలు తీరినట్లే



ప్రస్తుతం టన్ను దానిమ్మ రూ.1.40 లక్షల వరకు ధర పలుకుతోంది. ఇది ఇలాగే ఉంటే రైతుల కష్టాలు తీరి నట్లే. ఏడెకరాల్లో దానిమ్మ సాగుచేశా. ఎకరాకు రూ.60వేల వరకు పెట్టుబడి పెట్టా. గతేడాది పెద్దగా ధర లేదు. ఈసారి ఆశించిన స్థాయిలో దిగుబడి రావడంతోపాటు గిట్టుబాటు ధర కూడా దక్కుతోంది. విజయవాడ, చెన్నై ప్రాంతాలకు చెందిన వ్యాపారులు.. తోటల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. 40 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. తోటలోనే టన్ను రూ.1.40 లక్షలకు అమ్మేశా.

- ఆవుల రామకృష్ణ, రైతు, మర్తాడు

వ్యాపారులే వస్తున్నారు



ప్రస్తుతం దానిమ్మ సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. దానిమ్మ చెట్లకు ఎక్కువగా బ్యాక్టీరియా సోకుతుంది. కంటికి రెప్పలా కాపాడుకోవాలి. గతంలో పంటను విక్రయించేందుకు చాలా ఇబ్బందులు పడేవారం. ప్రస్తుతం డిమాండ్ ఉండడంతో వ్యాపారులే తోటల వద్దకు వస్తున్నారు.

- తిరుపతిరెడ్డి, గార్లదిన్నె

ధర నేలచూపు..

- పప్పుశనగకు దక్కని గిట్టుబాటు రేటు
- నష్టానికి అమ్ముకోలేకపోతున్న అన్నదాత
- ధాన్యమంతా గోదాములకు తరలిస్తున్న దుస్థితి

ధాన్యం గోదాము వైపు..!


తగ్గుపర్తిలో పప్పుశనగను గ్రేడింగ్ చేసి తరలించేందుకు సిద్ధం చేస్తున్న రైతులు

పప్పుశనగ ధర నేలచూపులు చూస్తోంది. తక్కువ ధరకు అమ్ముకోలేక అన్నదాతలు దిక్కులు చూస్తున్నారు. క్వింటా పప్పుశనగ ధర రూ.6 వేల లోపే పలుకుతోంది. చేసేదిలేక రైతులు పండించిన పంట అంతా గోదాములకు తరలిస్తున్నారు. అప్పులు చేసి.. రైతులు పెట్టుబడులు పెట్టారు. పంట పండినా అమ్ముకోలేని పరిస్థితి దాపురించింది. దీంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

బెళుగుప్ప, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లరేగడి భూముల రైతులకు పప్పుశనగ పంట జీవనాధారం. మండలవ్యాప్తంగా రబీలో 16,600 ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశారు. ఎకరాకు రూ.16వేల వరకు పెట్టుబడి పెట్టారు. తెగుళ్ల నివారణకు అధిక మొత్తంలో ఖర్చు చేశారు. దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. ఎకరాకు ఐదారు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కష్టాల నుంచి కొంతమేర ఉపశమనం లభిస్తుందని అన్నదాతలు ఆశించారు. వారికి ధరల విపత్తు ఎదురైంది. ఈసారి ధరలు పాతాళానికి పడిపోయాయి. క్వింటా రూ.6వేలు కూడా పలకట్లేదు. ఆ ధరకు విక్రయిస్తే గిట్టుబాటు కాదని అన్నదాతలు వాపోతున్నారు. ఇళ్లలో నిల్వ ఉంచుకుంటే పురుగు పడుతోంది. చేసేదిలేక రైతులు అద్దెలు చెల్లించి, గోదాముల్లో నిల్వ చేసుకుంటున్నారు. ధర పెరిగితేనే గట్టెక్కుతామనీ, అప్పటివరకు ఎదురుచూపులు తప్పవని అన్నదాతలు అంటున్నారు.

ఏడాదికేడాదికీ తగ్గుముఖం


గోదాములోకి చేర్చుతున్న హమాలీలు.. నిల్వ ఉంచిన పప్పుశనగ

పప్పుశనగ ధరలు తగ్గుతూ వస్తున్నాయి. మూడేళ్ల క్రితం క్వింటా పప్పుశనగ ధర రూ.పదివేలు పలికింది. గతేడాది రూ.8 వేలకు తగ్గింది. ప్రస్తుతం రూ.ఆరువేల లోపే పలుకుతోంది. ఈ ఏడాది కాస్తో.. కూస్తో.. దిగుబడి వచ్చినా ధర లేదు. ఏటా ధరలు తగ్గుముఖం పడుతుండటంతో కోలుకోలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే పప్పుశనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

గిట్టుబాటు ధర వస్తేనే గట్టెక్కగలం



30 ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశా. రూ.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. 150 క్వింటాళ్లకుపైగా దిగుబడి వచ్చింది. కష్టాలు తీరతాయనుకున్నా. ధరల్లేక అల్లాడుతున్నాం. గోదాము అద్దె భారమైనా తప్పని పరిస్థితుల్లో అందులో నిల్వ చేస్తున్నాం. క్వింటా రూ.8 వేలు ధర పలికితేనే గట్టెక్కగలం.

- కిష్టయ్య, రైతు, తగ్గుపర్తి

రూ.8 వేలతో కొన్నాం.. రూ.5,500తో విక్రయం



40 ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశా. 200 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. విక్రయిద్దామంటే ధరల్లేవు. పంట సాగు సమయంలో పప్పుశనగ విత్తనాన్ని రూ.8 వేలతో కొనుగోలు చేశాం. ఇప్పుడేమో రూ.5500లోపే ధర ఉంది. ఈ ధరకు విక్రయించుకోలేక గోదాములో నిల్వ ఉంచాం.

- రుద్రయ్య, రైతు, ఎర్రగుడి

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

పప్పుశనగ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

- పృథ్వీసాగర్, ఏఓ, బెళుగుప్ప

జాతకం బాగలేదు..!

ఆ నలుగురి జాతకం బాగలేనట్లుంది. జాతకం చెప్పే వ్యక్తిని నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి బెదిరించి.. దోచుకుని దొరికిపోయారు.


కుళ్లాయప్ప

హిందూపురం టూటౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి సీఐ జనార్దన్ తెలిపిన మేరకు, పామిడికి చెందిన కుళ్లాయప్ప ఊరూరా బైక్‌పై తిరుగుతూ జాతకం చెబుతుంటాడు. ఈ క్రమంలో శనివారం హిందూపురం పరిధిలోని సడ్లపల్లికి వచ్చాడు. వీధుల్లో తిరుగుతుండగా.. నాగరాజు, వెంకటేశ్, శివకుమార్, గంగాధర్ అనే నలుగురు జాతకం చెప్పించుకునే పేరిట ఊరి చివరకు తీసుకెళ్లారు. ముళ్ల పొదల్లోకి లాక్కెళ్లి దాడిచేశారు. తప్పుడు జ్యోతిష్యం చెబుతున్నావా అని నిలదీశారు. రూ.లక్ష ఇవ్వాలని, లేదంటే చంపేస్తామని బెదిరించారు. తనవద్ద అంత డబ్బు లేదని బతిమాలినా వినిపించుకోలేదు. దీంతో కుళ్లాయప్ప తన బంధువులకు ఫోన్ చేసి, వారి చేత రూ.30వేలు ఫోన్‌పే చేయించాడు. ఆ తరువాత వదిలేశారు. బాధితుడు నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఫోన్‌పే నంబరు ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు.

- హిందూపురం, ఆంధ్రజ్యోతి

గౌతమిపై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి


క్లాక్‌టవర్ వద్ద నిరసన తెలుపుతున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లిలో గౌతమిపై యాసిడ్ దాడిచేసి, కత్తితో పొడిచిన గణేష్‌ను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి డిమాండ్ చేశారు. గౌతమిపై దాడిని నిరసిస్తూ శనివారం ఐద్వా, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ వద్ద నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై సమగ్ర విచారణ చేయడంతోపాటు దాడులను అరికట్టాలన్నారు. ఇటీవల మహిళలు, విద్యార్థినులపై ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌తోపాటు హత్యాచారాలు తీవ్రంగా పెరిగాయన్నారు. వీటిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించి కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్దు, ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, ఉపాధ్యక్షుడు గిరి, సహాయ కార్యదర్శి శివ, సోము, ఐద్వా నగర అధ్యక్ష కార్యదర్శులు చంద్రిక, అశ్విని, రేణుక తదితరులు పాల్గొన్నారు.

జీడిపల్లికి ఇన్‌ఫ్లో 781 క్యూసెక్కులు

బెళుగుప్ప, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 781 క్యూసెక్కులున్నట్లు శనివారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 647 క్యూసెక్కులు, 36వ ప్యాకేజీ కింద 100 క్యూసెక్కులు వెళుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

టమోటా కిలో రూ.7

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 7తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 450 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 5, కనిష్ఠ ధర రూ. 4 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ. 20వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 21,100 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 3,500, సరాసరి రూ. 14వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 51 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

జిల్లాలో జీబీఎస్ కేసుల్లేవ్: డీఎంహెచ్ఓ

అనంతపురంటౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జీబీఎస్ వైరస్ కేసులు లేవని డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవి తెలిపారు. జీబీఎస్ వైరస్ కేసుల గురించి శనివారం ఆమె మీడియాతో ముచ్చటించారు. జిల్లాలో ఇప్పటికే క్యాన్సర్‌తోపాటు వివిధ వ్యాధులకు సంబంధించి వైద్య సిబ్బంది స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇదే సమయంలోనే జీబీఎస్ వైరస్ లక్షణాలు ఉన్నవారుంటే గుర్తిస్తామన్నారు. జీబీఎస్ వైరస్ కేసుల విషయంగా జిల్లా వైద్యశాఖ అప్రమత్తంగా ఉందన్నారు. డాక్టర్లు, సిబ్బందికి అలాంటి కేసులు విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం చేయకుండా తగిన సమాచారం ఇచ్చి అవసరమైన వైద్యసేవలు అందేలా చూడాలని ఆదేశించినట్లు తెలిపారు. జీజీహెచ్, సూపర్‌స్పెషాలిటీ వైద్యాధికారులు, డాక్టర్లతో దీనిపై చర్చించి ముందస్తు చర్యలకు ఆలోచిస్తున్నామన్నారు. కేసులు లేకపోవడంతో జిల్లాకు ఇంతవరకు ఆ వైరస్‌కు వినియోగించే ఇమ్యూనోగ్లోబ్యులిన్ ఇంజెక్షన్‌లు రాలేదన్నారు. అ ఇది అంటువ్యాధి కాదని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని డీఎంహెచ్ఓ అన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడి మృతి


హరికృష్ణ (ఫైల్)

రామగిరి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని శేషంపల్లి గ్రామానికి చెందిన హరికృష్ణ(30) శనివారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తాపడి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు....శేషంపల్లి గ్రామానికి చెందిన హరికృష్ణ శనివారం మధ్యాహ్నం ట్రాక్టర్‌లో వ్యవసాయ పనుల నిమిత్తం తోటకు వెళ్లాడు. అక్కడ ట్రాక్టర్ బోల్తా పడటంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. హరికృష్ణను స్థానికులు అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. రామగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య వరలక్ష్మి ఉన్నారు. వీరికి సంతానం లేదు. టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య సంఘటనా స్థలానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఇగుడూరులో చోరీ

తాడిపత్రి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇగుడూరు గ్రామంలో శనివారం మధ్యాహ్నం పుష్పావతి ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేసినట్లు ఎస్ఐ కాటయ్య తెలిపారు. ఆయన తెలిపిన మేరకు పుష్పావతి బంధువుల ఫంక్షన్ ఉన్నందున నార్పల మండలం కర్నపాడి గ్రామానికి వెళ్లారు. ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ఇంటిపైనుంచి దుండగులు చొరబడి బీరువాను పగలగొట్టి వాటిలో ఉన్న హుండీలు రెండు ఎత్తుకెళ్లారని వారు తెలిపారు. దాదాపు రూ.1.30లక్షలు ఉంటుందని వారు అంచనా వేశారు. అనంతరం క్లూస్‌టీం రప్పించి ఫింగర్‌ప్రింట్ నమూనాలను సేకరించారు. కేసు నమోదు చేశామని, త్వరలో దొంగను పట్టుకుంటామని ఆయన తెలిపారు.


బీరువాను పగలగొట్టడంతో చెల్లాచెదురుగా పడ్డ వస్తువులు

జంక్‌ఫుడ్‌తో జరభద్రం..!

చిన్నారులు, యువత ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

- అరికట్టకపోతే రక్తహీనత, ఊబకాయం
- ప్రమాదకరమంటున్న వైద్యులు
- ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలను పట్టించుకోని అధికారులు



మద్యపానం, ధూమపానం ఆరోగ్యానికి ఎంత హానికరమో.. ప్రస్తుతం జంక్‌ఫుడ్ కూడా అంతే ప్రమాదకరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. జంక్‌ఫుడ్ నుంచి పిల్లలను రక్షించాలంటూ ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నిబంధనల్ని జారీ చేసింది. ఆల్కహాల్ వంటివి చేసే నష్టం కంటే జంక్‌ఫుడ్ ఇంకా ప్రమాదకరమని స్పష్టం చేసింది.

ధర్మవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): జంక్‌ఫుడ్ తినే వారి సంఖ్య రోజురోజుకూ అధికమవుతోందని, వాటి నియంత్రణలో కఠిన చర్యలు చేపట్టకపోతే అనారోగ్య భారత్‌ను చూడవలసి వస్తుందని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆందోళన వ్యక్తం చేసింది. ప్యాకింగ్ ఫుడ్‌లో అతి ప్రమాదకరంగా ఉండే రసాయనాలను నిషేధించింది. కానీ జంక్‌ఫుడ్ తయారీదారులు వాటిని వాడుతూనే ఉన్నారు. ఇవి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా ప్రొఫైల్‌గానెట్, పొటాషియం, గ్లూటామెట్ వంటి రసాయాలపై నిషేధం విధించింది. కానీ జంక్‌ఫుడ్ తయారీదారులు వీటిని యథేచ్ఛగా వాడుతున్నారు. అధిక తీపిని ఇచ్చే హైఫ్రక్టోజ్ కార్న్‌సిరప్ రసాయనాన్ని వినియోగించకూడదని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలు జారీ చేసింది. దీని వల్ల షుగర్, కిడ్నీ సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొంది. వీటిని కూడా అధికంగా వాడేస్తున్నారు. పిల్లల చదువుపై దృష్టి పెట్టినట్లే వారి తిండిపై కూడా తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉంచాలని, జంక్‌ఫుడ్ ప్రభావం జీవితాంతం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

రక్తహీనత, ఊబకాయం

జంక్‌ఫుడ్ కారణంగా బాలికల్లో రక్తహీనత, బాలురలో ఊబకాయం పెరుగుతోంది. కొంత మంది బాలురు సరిగ్గా ఆహారం తినకపోయినా లావుగా ఉంటారు. దీనికి కారణం శరీరంలో జంక్‌ఫుడ్ వ్యర్థాలు పేరుకుపోవడమే. బాలికల్లో జంక్‌ఫుడ్ కారణంగా సరైన సమయంలో పీరియడ్స్ రాకపోవడం, నరాలు, నొప్పులు కంటి చూపు తగ్గడం వంటి సమస్యలు తలెత్తున్నాయి.

తల్లిదండ్రులే జాగ్రత్త పడాలి

ఆరోగ్యం పట్ల ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటాయని అనుకోవడం కన్నా వీటి ప్రభావం నుంచి రక్షించుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉంది. దీనికి తోడు పిల్లలు అందుబాటులో ఉండే ఆహారాన్నే తింటుంటారు. వారికి అందుబాటులో ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఉంచే బాధ్యతను కూడా తల్లిదండ్రులు చూసుకోవాలి. జంక్‌ఫుడ్ శరీరంలో పేరుకుపోవడంతో పాటు నాడీ, జీర్ణవ్యవస్థలు, మెదడు, గుండెపోటుతో పాటు 18 రకాల అవయవాల పనితీరుపై ప్రభావం చూపుతుందని నిపుణులు అంటున్నారు.

చిన్నారులకు అందాల్సినవి..

7-10 మధ్య వయసు కలిగిన అబ్బాయిలకు 77 గ్రాములు, 13-14 ఏళ్ల మధ్య ఉన్న వారికి 86 గ్రాములు కొవ్వు పదార్థాలు ఉండే ఆహారాన్ని అందించాలి. అమ్మాయిలకు 68 గ్రాములు, 79 గ్రాములు అందించాలి. 14 సంవత్సరాల లోపు వరకు అమ్మాయిలకు, అబ్బాయిలకు గాని 170-250 గ్రాముల కార్బోహైడ్రేట్లు ఆహారంలో ఉండాలి. ఉడికించిన ఆహార పదార్థాలయినా అధిక ఉప్పు, కారం, నూనె లేకుండా చూడాలి. పాలు, గుడ్లతో పాటు ప్రతి రెండు రోజులకు ఒకసారి మాంసాహారాన్ని అందించాలి.

పేరుకుపోతున్న వ్యర్థాలు

ఫాస్ట్‌ఫుడ్, ఇతర ఆహారం వల్ల నేటి తరంలో అన్ని వయసుల వారి పొట్టలో వ్యర్థాలు పేరుకుపోతున్నాయని నిపుణులు చెబుతున్నారు. చిన్న పిల్లలు సరాసరిన రోజుకు 30 నుంచి 50 గ్రాముల వరకు చాక్లెట్లను తింటున్నారని అంచనా. ఈ కారణంగా ఆయా వయసుల వారీగా ప్రతి ఒక్కరిలోనూ 30 గ్రాముల నుంచి 100 గ్రాముల వరకు వ్యర్థాలు ఉంటున్నాయి. వీటి ప్రభావం ఎముకల ఎదుగుదల, మనిషి పెరుగుదలపై ఉంటుంది. జంక్‌ఫుడ్‌లో వాడే మైదా, నూనెవంటి వాటితో విష, కొంకి, బద్దెపురుగులు, ఏలికపాములు వంటివి శరీరంలోకి చేరుతున్నాయి. పిల్లల ఎదుగుదలపై ఇవి ప్రభావం చూపుతాయి.



ఎఫ్ఎస్ఎస్ఏఐ మార్గదర్శకాలు

పాఠశాలలకు, విద్యార్థుల వసతి గృహాలకు 50 మీటర్ల వరకు చిరుతిళ్ల దుకాణాలపై ఎఫ్ఎస్ఎస్ఏఐ నిషేధం విధించింది. ఈమేరకు పలు మార్గదర్శకాలను విడుదల చేసింది. పిల్లలకు ఇచ్చే స్నాక్స్ బాక్స్‌లలో సాధ్యమైనంతవరకు ఫ్రూట్ సలాడ్‌లు, పల్లీలు, బెల్లంతో చేసిన చిక్కీలు, లడ్డూలు, రాగులు, జొన్నలు, సజ్జలతో తయారుచేసే వంటకాలు ఉండేలా చూడాలి. ఒక్కసారి తింటే ఏమవుతుందని జంక్‌ఫుడ్ విషయంలో తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించకూడదు. పిల్లలు రోజూ తినే ఆహారంలో 300 గ్రాముల కూరగాయలు, వీటిలో ఆకుకూరలు 50 గ్రాములు, దుంపలు 50 గ్రాములు ఉండేలా చూసుకోవాలి. దుకాణాల్లో అమ్మే చిరుతిళ్లపై ఎప్పటికప్పుడు అధికారులు తనిఖీలను నిర్వహిస్తు ఉండాలి.

జంక్‌ఫుడ్ తినడం ప్రమాదకరం



జంక్‌ఫుడ్ తినడం ప్రమాదకరం. ముఖ్యంగా చిన్నపిల్లలు జంక్‌ఫుడ్ తినడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. పిల్లల ఎదుగుదలపై ప్రభావం చూపుతాయి. పానీపూరి, పిజ్జాలు, బర్గర్లు, నూడుల్స్, గోబీ, కేకులు తినేవారికి భవిష్యత్తులో సమస్యలు ఎదురవుతాయి. పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. ఆహారపు అలవాట్లు పూర్తిగా మార్చుకోవాలి. ఇంటిలో వండే వాటినే తినాలి. అలాగే పండ్లు, మాంసాహారం తీసుకోవాలి.

- డాక్టర్ నజీర్, ప్రభుత్వ వైద్యుడు, ధర్మవరం

కాంప్లెక్స్ మీటింగ్ కష్టాలు...!

ఇబ్బందులు పడ్డ ఉపాధ్యాయులు


కళ్యాణదుర్గం మండలం గోళ్ల జడ్పీహైస్కూల్‌లో 5.30 గంటల తర్వాత అటెండెన్స్ వేయడానికి ఇబ్బందులు పడుతున్న టీచర్లు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ నిర్వహించిన క్లస్టర్ కాంప్లెక్స్ మీటింగ్‌లపై ఉపాధ్యాయులు పెదవి విరిచారు. శనివారం నిర్వహించిన ఈ మీటింగ్‌లపై మెజార్టీ టీచర్లు, సంఘాల నేతల నుంచి అసహనం వ్యక్తమైంది. గ్రామీణ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాల్లో మీటింగ్స్‌కు హాజరైన ఉపాధ్యాయులు హాజరు యాప్ లాక్ వల్ల ఇబ్బంది పడ్డారు. మడకశిర, రాయదుర్గం తదితర సుదూర ప్రాంతాల్లో పని చేసే టీచర్లు మీటింగ్ పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణమయ్యేందుకు చాలా ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా మీటింగ్ ముగింపు సమయం 5 గంటలకే ఉన్నా... 5.30 గంటలు, 6 గంటల వరకూ అటెండెన్స్ పడకుండా లాక్ చేయడంపై ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సాయంత్రం అటెండెన్స్ పడక 6 గంటల వరకూ మీటింగ్ ప్రాంతాల్లోనే ఉన్నామని, తర్వాత సుదూర ప్రాంతాల నుంచి తిరుగు ప్రయాణమ య్యేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నట్టు వాపోయారు.

పెదవి విరిచిన సంఘాల నేతలు

ప్రభుత్వాలు మారినా....విద్యారంగంపై అధికారుల పెత్తనం మారలేదంటూ ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గౌనిపాతిరెడ్డి పెదవి విరిచారు. కాంప్లెక్స్ మీటింగ్స్ సమయాన్ని మార్చాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధానకార్యదర్శి రామాంజనేయులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. క్లస్టర్ కాంప్లెక్స్ క్లోజింగ్ అటెండెన్స్ లాక్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సిరాజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. మీటింగ్ తర్వాత చాలా మంది టీచర్లు యాప్‌లో హాజరు పడక అనేక ఇబ్బందులు పడ్డారని, 6 గంటల వరకూ ఎదురు చూశారని గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య, ప్రధానకార్యదర్శి రవీంద్ర ప్రకటనలో అసహనం వ్యక్తం చేశారు.

బాధ్యతల స్వీకరణ


ఎస్సీ వెల్ఫేర్ ఇన్‌చార్జ్ డీడీ రాధిక

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): ఎస్సీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాధిక బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు శనివారం ఆమె డీడీ ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి నుంచి అధికారికంగా బాధ్యతలు తీసుకున్నారు. ఇదివరకూ డీడీగా విధులు నిర్వహిస్తున్న ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి రామాయపట్నం పోర్ట్‌కు డెప్యుటేషన్‌పై వెళ్లగా ఆయన స్థానంలో గుత్తి ఏఎస్‌డబ్ల్యూఓగా విధులు నిర్వహిస్తున్న రాధికకు ఇన్‌చార్జ్ డీడీ బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. దీంతో ఆమెకు కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

హంద్రీనీవా లైనింగ్ ఆపాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


మాట్లాడుతున్న రామకృష్ణ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు వెంటనే ఆపాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, అనంతపురం జిల్లా కార్యదర్శి జాఫర్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.... కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో సామాన్య ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. ఆదాయపు పన్ను మినహాయింపుతో మిడిల్ క్లాస్ ఉద్యోగులకు తప్ప ఎవరికీ ప్రయోజనం లేదన్నారు. రైతులు, సామాన్యులకు, కార్మికులకు ఎవరికీ ఎలాంటి ఊరట లభించలేద న్నారు. అందువల్లే వారం రోజులపాటు దేశవ్యాప్తంగా నిరసనలు తెలుపుతూ...ప్రజల్లో చైతన్యం తెస్తున్నామన్నారు. జగదీష్ మాట్లాడుతూ హంద్రీ కాలువ లైనింగ్ పనులను జిల్లా రైతులు వ్యతిరేకిస్తున్నారన్నారు. కాలువను వెడల్పు చేయాలని, 5 వేల క్యూసెక్కులు వచ్చేలా చేయాలన్నారు. లైనింగ్ పనులను రైతులతోపాటు టీడీపీ శాసన సభ్యులు, కార్యకర్తలు కూడా వ్యతిరేకిస్తున్నారన్నారు. జిల్లాలో కబ్జాదారులకు పోలీసులు అండగా నిలుస్తున్నారన్నారు. వీటిపై బాధితులు ఫిర్యాదు చేస్తే కోర్టుకు వెళ్లాలని సూచించడం సరికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మల్లికార్జున, శ్రీరాములు, లింగమయ్య, కుళ్లాయిస్వామి తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి

హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి



అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాన్ని, హైందవ ధర్మాన్ని కాపాడుకోవాలని హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి పేర్కొన్నారు. జిల్లా కేంద్రం ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహా కుంభాభిషేక వేడుకలు రెండో రోజు శనివారం కొనసాగాయి. ఉదయం ఆలయ ఆవరణలో 108 జంటలతో సామూహికంగా గణపతి, నవగ్రహ, లక్ష్మీనారాయణ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. సాయంత్రం హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి హాజరై లక్ష్మీవెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో ఆయన భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. ఎంతోమంది మహనీయులు దేశపర్యటనలు చేసి హిందూ సంప్రదాయాన్ని నలుదిశలా వ్యాపింపజేశారని తెలిపారు. ప్రస్తుత పాశ్చాత్య సంస్కృతి నుంచి మానవాళి బయటపడి, ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని, అపుడే ఇంతటి బిజీ ప్రపంచంలోనూ మానసిక ప్రశాంతతను పొందగలమన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, అర్చకబృందం, భక్తులు పాల్గొన్నారు.

పొలాలను బీళ్లుగా ఉంచవద్దు

- కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పొలాలను రైతులు బీళ్లుగా ఉంచకూడదని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. అనంతపురం ఆకాశ వాణి కేంద్రం ఆధ్వర్యంలో శనివారం కిసాన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలుగు తల్లి విగ్రహానికి కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన ఎద్దుల బండిపై వారు జడ్పీ ఆవరణలోని సమావేశపు హాల్ వద్దకు చేరుకున్నారు. అక్కడే ఏర్పాటు చేసిన పలు రకాల స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ తెలుగు తల్లి విగ్రహం నుంచి ఎద్దుల బండిపై రావడం తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తిచేసిందన్నారు. రైతుల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ప్రతి గురువారం ఉదయం 7.45 గంటల నుంచి 8.15 గంటల దాకా ఆకాశ వాణి డైరెక్టర్‌తో మాట్లాడి గత ఏడు వారాలుగా అనంత మిత్ర ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ భూ సమస్యలపై ముందుగా స్థానిక సచివాలయాల్లో తగిన ఆధారాలతో ఫిర్యాదు చేయాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మాట్లాడుతూ... కరువు జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆకాశ వాణి కేంద్రం డైరెక్టర్ నాగేశ్వరరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, సెంట్రల్ సిల్క్ బోర్డు జేడీ కిరణ్‌కుమార్, పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

న్యూస్ బాక్స్

పంచాయతీల అభివృద్ధికి నిధులివ్వండి

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి డేగల వినతి

శింగనమల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పంచాయతీల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు కేటాయించేలా చూడాలని రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ కార్య నిర్వా హక కార్యదర్శి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి కోరారు. ఆయన శనివారం టీడీపీ నాయకుడు నిట్టూరు శివాజీతో పాటు మంగళగిరిలోని టీడీపీ కార్యా లయంలో పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులును కలిశారు. గత వైసీపీ పాలనలో నిధులను దారి మళ్లించడంతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు సాగలేదన్నారు. ఇప్పుడైనా ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతోందని పల్లా శ్రీనివాసులు హామీ ఇచ్చినట్లు డేగల కృష్ణమూర్తి తెలిపారు.

'రెగ్యులర్ వైద్యులను నియమించాలి'

శింగనమల, ఫిబ్రవరి 15(ఆంధ్యజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలకు ప్రభుత్వం రెగ్యులర్ వైద్యులను నియమించాలని రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యా దవ్‌ను టీడీపీ సీనియర్ నాయకుడు, న్యాయవాది సైకిల్ యాటా వెంకట సుబ్బన్న కోరారు. నగరంలో శనివారం జరిగిన మేధావుల సమావేశంలో ఆయన బీజేపీ లీగల్ సెల్ జిల్లా నాయకుడు పూజారి గోపాల్‌రావు, టీడీపీ నాయకుడు వెన్నపూస భాగ్యలక్ష్మిరెడ్డితో కలసి మంత్రికి వినతి పత్రం అందజేశారు.

జేఎన్టీయూకి ఎన్‌ఐటీ అవార్డు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి ఎన్‌ఐటీ రూర్కెలా నుంచి అవార్డు లభించింది. విభాగా ధిపతి డాక్టర్ కళ్యాణిరాధ, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఓంప్రకాష్ సంయుక్త పరిశోధనకు అవార్డు వచ్చిందని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ తన కార్యాలయంలో కళ్యాణిరాధ, ఓం ప్రకాష్‌ను శనివారం అభినందించి అవార్డు, సర్టిఫికెట్లను అందజేశారు.

రైతులకు యూనిక్ నంబర్ తప్పని సరి: ఏడీఏ

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రైతులకు యూనిక్ నెంబర్ తప్పని సరి చేసినట్లు ఏడీఏ రవి పేర్కొన్నారు. అనంతపురం ఏఓ కార్యాలయంలో శనివారం అగ్రిస్టాక్ వెబ్ సైట్‌లో రైతుల రిజిస్ట్రేషన్‌పై ఆయన ఆరా తీశారు. భవిష్యత్తులో ప్రభుత్వాల పథకాలను యూనిక్ నెంబర్ ఉంటేనే వర్తింపజేసే ప్రభుత్వం యోచనలో ఉందని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

● రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయాన్ని మరింత ప్రోత్సహించాలని రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్ సూచించారు. నగరంలోని ప్రకృతి వ్యవసాయం జిల్లా కార్యాలయంలో శనివారం ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యాన తోటలు కూరగాయలు తదితర పంటలను ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేయడంపై అవగాహన కల్పించారు.

18న రుణాలకు ఇంటర్వ్యూలు

నార్పల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాల మంజూరు కోసం ఈనెల 18, 19వ తేదీలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గంగావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు కేటాయించిన తేదీల్లో ఎంపీడీఓ కార్యాలయానికి రావాలన్నారు.

ఎస్వీఐటీలో పోస్టర్ ప్రెజెంటేషన్

రాప్తాడు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని హంపాపురం సమీపంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో హెచ్ అండ్ ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం పోస్టర్ ప్రెజెంటేషన్ నిర్వహించారు. కళాశాలలో చదివే మొదటి సంవత్సరం విద్యార్థులు సైన్స్ మరియు టెక్నాలజీ అంశాల మీద పలు రకాల ప్రెజెంటేషన్‌లు ప్రదర్శించారు. కళాశాల కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ, చైర్మన్ క్రిష్టారెడ్డి, వైస్ చైర్మన్ రవీంద్రారెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులను సహించం : సాకే హరి

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): దళితులపై దాడులు చేస్తే ఊరుకోమని, ప్రభుత్వాలపై పోరాటాలు చేయాల్సి వస్తుందని ఎస్సీ ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి పేర్కొన్నారు. దేశంలో దళితులపై దాడులను అరికట్టాలని శనివారం ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో రామకృష్ణ, నారాయణస్వామి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాకెట్ల వార్డెన్‌పై చర్యలు తీసుకోండి

● డీడీకి ఎస్సీ సంఘాల నేతల వినతి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సకాలంలో దుస్తులు అందించకుండా నిర్లక్ష్యం వహించిన రాకెట్ల ఎస్సీ వసతి గృహం వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బీ, ఎంఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐఎస్‌బీ జిల్లా ప్రధానకార్యదర్శి పాపిరెడ్డిపల్లి పృథ్వి, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేష్ శనివారం డీడీ రాధికను కలిసి వినతి పత్రం అందజేశారు. రాకెట్ల వార్డెన్ నిర్లక్ష్యం కారణంగా దాదాపు 500 జతల యూనిఫాంలు చెత్తపాలయ్యాయన్నారు.

పీవీకేకేలో ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ పై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం, సీఎస్‌జీ విభాగం సంయుక్తంగా ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమం శనివారం ముగిసింది. పలువురు నిపుణులు, అధ్యాపకులు ఆధునిక సాంకేతికతపై అవగాహన కల్పించారు. కళాశాల చైర్మన్ పల్లె కిశోర్, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, ఏఓ మనోహర్‌రెడ్డి, సీఎస్ఈ విభాగాధిపతి దిలీప్ వెంకటకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల మంజూరుపై హర్షం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు

రామగిరి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నసనకోట సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో శనివారం పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర, ఎమ్మెల్యే పరిటాల సునీత చిత్రపటాలకు విద్యార్థినులు క్షీరాభిషేకం చేశారు. టీడీపీ స్థానిక నాయకులు విద్యార్థులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ఎంతో కృషిచేశారని తెలిపారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి రథోత్సవం



రథంపై స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం, (ఇన్‌సెట్‌లో) ఉత్సవ విగ్రహం

● జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు
● స్వామి నామస్మరణతో మార్మోగిన కోటంక గ్రామం

గార్లదిన్నె, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగుబంగారమైన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథోత్సవం శనివారం రాత్రి ఘనంగా సాగింది. మండల పరిధిలోని కోటంక గ్రామ సమీపంలో వెలసినస్వామి తిరునాళ్లలో భాగంగా మూడో శనివారం దేవాదయశాఖ , గ్రామస్థుల ఆధ్వర్యంలో రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు రామాచార్యులు స్వామివారి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించి, హోమాలు చేశారు. అనంతరం స్వామి వెండి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై అధిష్ఠించారు. ఆలయం వద్ద నుంచి కోటంక గ్రామంలో ఊరేగించారు. మండలం నుంచే కాకుండా జిల్లాలోని నలుమూలాలు నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తులు స్వామివారికి అడుగడుగున నిండుబిందెనీళ్లు పోసి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నామస్మరణాలతో కోటంక గ్రామం మారుమ్రోగింది. శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య, ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్‌భాషా ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

సావిత్రమ్మ హత్య కేసు ఛేదింపు

● ఒకరి అరెస్ట్, 41 గ్రాముల బంగారం నగలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు నగలతో ఎస్పీ, డీఎస్పీ, సీఐలు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని టీచర్స్ కాలనీలో ఒంటరిగా నివశిస్తున్న సావిత్రి హత్య కేసును నాలుగో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని పాతూరు నీరుగంటివీధికి చెందిన షేక్ అన్సర్ అలియాస్ చాబూసాను అరెస్ట్ చేశారు. అతడి నుంచి 41 గ్రాములు కలిగిన రెండు బంగారు చైన్లు, రూ.34500లు, సెల్‌ఫోన్, ద్విచక్రవాహనం, స్టిక్కర్ కట్టింగ్ స్లైడింగ్ బ్లేడ్ స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ జగదీష్ హత్య కేసు ఛేదింపు వివరాలను శనివారం వెల్లడించారు.

వ్యసనాలతో అప్పులపాలై.. : షేక్ అన్సర్ వెల్డింగ్ పనులు చేస్తూ జీవించేవాడు. తాగుడు, వ్యభిచారం తదితర చెడు వ్యసనాలతో ఉండటంతో అప్పులు చేశాడు. వారి నుంచి ఒత్తిళ్లు అధికమయ్యాయి. సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఒంటరిగా ఉంటున్న వృద్ధులను టార్గెట్ చేసి వారి నుంచి ఆభరణాలు, డబ్బు కాజేయాలనుకున్నాడు. ఆ క్రమంలోనే ఆరో తేదీ మధ్యాహ్నం సావిత్రి ఇంటికెళ్లి టులెట్ బోర్డు ఉంది కదా, తనకు బాడుగకు ఇవ్వాలని కోరాడు. తాగడానికి నీళ్లడిగాడు. ఆమె నీళ్లు ఇవ్వడానికి వెళ్లగా... స్టిక్కర్ బ్లేడ్‌తో ఆమె గొంతు కోసి హత్య చేశాడు. ఆమె మెడలోని బంగారు చైను, పగడాల బంగారు చైను, సెల్‌ఫోను లాక్కుని పరారయ్యాడు. సీఐ సాయినాథ్, సీసీఎస్ సీఐ జయపాల్‌రెడ్డి, ఎస్‌ఐలు రాంప్రసాద్, రాజశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో సిబ్బంది బృందంగా ఏర్పడి చెరువుకట్ట సమీపంలో నిందితుడిని అరెస్ట్ చేశారు. కాగా ఈ కేసు విచారణలో భాగంగా ఈనెల 9వతేదీన అనంతపురం రూరల్ మండలం కురుగుంటలోని ఓ ఇంట్లో కూడా షేక్ అన్సర్ దొంగతనానికి పాల్పడ్డాడు. ఆ కేసులో రూ.34500లు స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదింపులో శ్రమించిన సీఐ సాయినాథ్, సీసీఎస్ సీఐ జయపాల్‌రెడ్డి, ఎస్‌ఐలు రాంప్రసాద్, రాజశేఖర్‌రెడ్డిలను ఎస్పీ అభినందించారు.

మధు రాయల్ బెదిరిస్తున్నారు

● ఆత్మహత్య చేసుకుంటా ● బాధితుడి వీడియో వైరల్



సెల్ఫీ వీడియోలో రోహిత్ యాదవ్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 40 డివిజన్ కార్పొరేటర్ భర్త మధు రాయల్ బెదిరింపులకు దిగారని, తన అంతు చూస్తానన్నారని, ఇక తనకు చావే దిక్కు అంటూ టీడీపీ మాజీ కార్పొరేటర్ కుమారుడు రోహిత్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధు రాయల్ తనను వేధిస్తున్నాడని రోహిత్ ఆవేదనతో చెప్పిన సెల్ఫీ వీడియో వైరల్‌గా మారింది. తన పేరు రోహిత్ యాదవ్ అని, తమ తల్లి మాజీ కార్పొరేటర్(సుజాత 40వ డివిజన్ 2014-19) అని వీడియో ద్వారా తెలిపారు. మధు తనను చాలా బెదిరింపులకు గురి చేశాడని, దుర్భాషలాడాడని కన్నీటిపర్యంతమయ్యాడు. తాను కూడా టీడీపీ మాజీ కార్పొరేటర్ కొడుకునని, తన గురించి ఈ స్థాయిలో మాట్లాడుతు న్నారంటే...ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నాడు. ఆయన అట్లే రౌడీయిజం చేస్తుంటే, ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంటున్నాని వీడియోలో పేర్కొన్నాడు.

రూ.3 లక్షల వ్యవహారమే: మధు రాయల్‌కు నాలుగేళ్ల క్రితం రూ. 3లక్షల డబ్బు ఇచ్చానని, దానిపైనే ఇదంతా జరిగిందని రోహిత్ సన్నిహితులతో చెప్పినట్లు తెలిసింది. ఆ ఇద్దరూ ఆజాద్‌నగర్‌లోనే ఉంటున్నారు. మధు రాయల్ భార్య శ్రీలక్ష్మి కార్పొరేటర్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచారు. తొలుత వైసీపీ వర్గంగా ఉన్నా తాజాగా టీడీపీలో చేరారు. ఆ డబ్బు అప్పుడిస్తా...ఇప్పుడిస్తానని చెప్పిన మధు రాయల్, పైసా ఇచ్చేది లేదని ఈ మధ్య చెప్పాడట. తాజాగా ఇద్దరూ ఫోన్‌లో వాదించుకున్నట్లు సమాచారం. రోహిత్ నిర్వహిం చే విజయపబ్లిక్ స్కూల్ విషయంలో అడ్మిషన్లు రాకుండా అడ్డుకుంటున్నా రని, స్కూల్ విషయంలో ఎందుకు జోక్యం చేసుకుంటున్నావని అడిగితే బూతులు మాట్లాడారని సమాచారం.

ఒలంపియాడ్‌లో మాంటిస్సోరి విద్యార్థుల సత్తా

అనంతపురం విద్య, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఇంగ్లీష్ ఒలంపియాడ్‌లో మాంటిస్సోరి విద్యాసంస్థల విద్యార్థులు భారీగా సత్తా చాటారు. ఆ విద్యార్థులను కరస్పాండెంట్ సూర్య నారాయణరెడ్డి శనివారం అభినందించారు. యూనిఫైడ్ ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ ఒలంపి యాడ్ పరీక్షలు జాతీయ స్థాయిలో నిర్వహించారన్నారు. మాంటిస్సోరి విద్యార్థులు 6, 11, 16, 20, 24, 26, 27, 31, 33, 35 ర్యాంకులు, బంగారు పతకాలు, నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు సాధించారన్నారు. అదేవిధంగా నేషనల్ అచీవర్స్‌గా గుర్తింపు పొందడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మాధవి, ప్రిన్సిపాల్ పద్మావతి, టీచర్లు పాల్గొన్నారు.

కార్పొరేటరంటే లెక్కలేదా..?

● నగరపాలిక ఎదుట నిరసన తెలిపిన బాబా ఫకృద్దీన్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ బాబా ఫకృద్దీన్ నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద హల్‌చల్ చేశారు. అధికారపార్టీ కార్పొరేటర్ నైన తననే అవమాని స్తారా అంటూ మెయిన్ గేటు ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. 12వ డివిజన్ కార్పొరేటర్ బాబా ఫకృద్దీన్ శనివారం మధ్యాహ్నం కార్పొరేషన్ కార్యాలయంలోకి వెళ్లారు. నేరుగా కమిషనర్ చాంబర్ వద్దకు వెళ్లి, కాస్త డోర్ తెరిచి కమిషనర్ బాలస్వామికి కనిపించారు. లోపల తన సీట్లో కూర్చున్న కమిషనర్ ఐదు నిమి షాలు ఆగండి అన్నారు. ఓకే అని కార్పొరేటర్ బయటకు వచ్చారు. అయితే వీళ్లను ఎందుకు పంపుతారు? ఎవర్నంటే వారిని పంపితే కమిషనర్ తిడుతున్నారని అక్కడున్న సిబ్బందిలో ఒకరు అన్నారట. ఆ మాట విన్న కార్పొరేటర్ సీరియస్ అయ్యారు. తాను కార్పొరేటర్‌నని, అందులోనూ అధికార పార్టీకి చెందిన వాడినని, తనకే గౌరవం ఇవ్వకపోతే ఎలా అంటూ మండిపడ్డారు. వెంటనే కార్పొరేషన్ కార్యాలయం బయట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కొందరు అధికారులు వచ్చి ఆయనను లేవదీసే ప్రయత్నం చేశారు. కార్పొరేటర్లకు కనీస గౌరవం ఇవ్వరా...? అలా అయితే... కార్పొరేటర్లు నాట్ అలౌడ్ అని బోర్డు పెట్టుకో వాలని సూచించారు. చివరికి కమిషనర్ బాలస్వామి వచ్చి సర్దిచెప్పారు. తనతో పాటు తన చాంబర్‌కు తీసుకెళ్లారు. తాగడానికి నీళ్లు ఇచ్చి మాట్లా డించారు. దీంతో కార్పొరేటర్... కొన్ని ఫైల్స్ పెండింగ్‌లో ఉంటున్నాయని, సచివాలయాలలో ఉద్యోగులు సమయానికి ఉండటం లేదని కొన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారట. తానూ కొత్తగానే వచ్చానని...వాటిపై దృష్టి సారిస్తానని కమిషనర్ చెప్పినట్లు సమాచారం.

కబ్జా చేశారని ఫిర్యాదు

● ఐదుగురిపై త్రీటౌన్‌లో కేసు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని హెచ్చెల్సీ కాలనీలోని ఓ ప్రైవేట్ ల్యాండ్ ప్రహరీగోడ ధ్వంసం చేసి, దౌర్జన్యంగా తాత్కాలిక గుడిసెలు వేసిన వారిపై అనంతపురం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రస్తుతం ఐదుగురిపై కేసు న మోదు చేశామని, మరికొందరిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ శాంతిలాల్ తెలిపారు. బుక్కరాయసముద్రంలోని టీచర్స్‌కాలనీకి చెందిన కసిరెడ్డి సూ ర్యనారాయణరెడ్డికి ఆయన తండ్రి నుంచి హెచ్చెల్సీ కాలనీలో వారసత్వంగా వచ్చిన సర్వే ,ంబరు 95/1బిలోని 64 సెంట్ల భూమి ఉంది. భాగ పరిష్కారాల్లో ఆయన భాగానికి వచ్చింది. ఈ భూమిలో ఆయన కుమార్తె రెడ్డి భారతికి 21 సెంట్ల భూమిని బహుమతిగా ఇచ్చారు. మిగిలిన భూమికి ప్రహరీగోడ నిర్మించి తన స్వాధీనంలో ఉంచుకున్నాడు. ఈ నెల 2వ తేదీన కొంత మంది ఓ ప్రజాసంఘం పేరు చెప్పి ఆ భూమి ప్రహరీ గోడను ధ్వంసం చేశారు. ఆ భూమిలో తాత్కాలిక గుడిసెలు నిర్మించారు. ఈ విషయం తెలిసిన బాధితుడు అక్కడికి వెళ్లగా కొందరు తిట్టి బెదిరించారు. దీనిపై కసిరెడ్డి సూర్యనారాయణరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. భూ కబ్జాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

గోదావరి జన్మస్థలాన్ని దర్శించిన ఎమ్మెల్యే



బ్రహ్మగిరి పర్వతం ఆలయంలో స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని నాసిక్ సమీపంలో గోదావరి జన్మస్థలాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత సందర్శించారు. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒక్కటైన త్రయంబకేశ్వర క్షేత్రం పర్యటనలో భాగంగా ఆమె బ్రహ్మగిరి పర్వత ప్రాంతాన్ని శనివారం సందర్శించారు. కొండపై వెళ్లే మార్గంలో ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అత్యంత పవిత్రమైన గంగానది జన్మ స్థలాన్ని సందర్శించడం తన పూర్వ జన్మ సుకృతమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

అనంత షార్ట్‌ఫిల్మ్ అవార్డుల ఆవిష్కరణ

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అనంత షార్ట్‌ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో లఘుచిత్రోత్సవ విజేతలకు అందించే అవార్డులను శనివారం ఆవిష్కరించారు. సొసైటీ ఆధ్వర్యంలో జనవరి 27 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు అనంతపురంలో లఘుచిత్రోత్సవ పోటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వివిధ విభాగాల్లో 10 లఘుచిత్రాలను అవార్డులకు ఎంపిక చేశారు. వారికి అందించేందుకు సిద్ధం చేసిన అవార్డులను శనివారం ఆ సొసైటీ కార్యాలయంలో సినీ దర్శకుడు కొండవీటి సత్యం చేతులమీదుగా ఆవిష్కరించారు. సొసైటీ అధ్యక్షుడు రషీద్‌బాషా, వినయ్‌కుమార్, భాస్కర్, సత్యనారాయణ, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టాన్ని పటిష్టంగా అమలుచేయాలి

● ఆర్డీఓ కేశవనాయుడు



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీఓ కేశవనాయుడు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : లింగనిర్ధారణ చేయడం చట్టరీత్యానేమని, అలాంటి చట్టాన్ని జిల్లాలో పటిష్టంగా అమలుచేయాలని అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో శనివారం డివిజన్ స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ... రాజ్యాంగం మగపిల్లలతో పాటు ఆడపిల్లలకు సమాన హక్కులు కల్పించిందన్నారు. అయినా ఆడ పిల్లల పట్ల చిన్న వివక్ష సరికాదన్నారు. లింగ నిర్ధారణ చేయించుకొని ఆడపిల్ల అని తేలితే బలవంతంగా అబార్షన్ చేయించుకుంటున్నారన్నారు. ఆడపిల్లలను సంరక్షించాలని ప్రభుత్వాలు లింగనిర్ధారణ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ఆ చట్టానికి విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్కానింగ్ సెంటర్లు, సంబంధత డాక్టర్ల పట్ల కమిటీ ప్రత్యేకనిఘాఉంచాలనిసూచించారు. కార్యక్రమంలో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న, జిల్లా ఆస్పత్రి చిన్నపిల్లల డాక్టర్లు శంకరనారాయణ, గంగాధరరెడ్డి, డెమో త్యాగరాజు, డీపీఐఆర్ఓ గురుమూర్తి, పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సరిహద్దు మండలాలపై నిఘాపెట్టండి : కలెక్టర్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సమష్టిగా పనిచేసి పటిష్టంగా లింగనిర్ధారణ నిషేధితచట్టాన్ని అమలుచేయాలని కలెక్టర్ డాక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. ఆయన శనివారం పామిడిమండలం వంకరాజుకాలువ గ్రామసచివాలయం నుంచి కలెక్టరేట్‌లో హాజరైన అనంత వైద్యశాఖ, కర్ణాటక వైద్యాధికారులతో మా ట్లాడారు. లింగనిర్ధారణ చేయడం చట్ట విరుద్ధమన్నారు. కర్ణాటక సరిహద్దు మండలాలైన విడపనకల్, బొమ్మనహాళ్, డి. హీరేహాళ్, గుమ్మగట్ట, బ్రహ్మ సముద్రం, కుందిర్పి, కంబదూరు మండలాలలో ఆడపిల్లల సంఖ్య తక్కు వుగా ఉంటోందన్నారు. ఆ ప్రాంతాలో లింగనిర్ధారణ ఎక్కువగా జరగడం వల్లనే ఇలాంటి పరిస్థితి ఉందనే ఆరోపణలు వస్తున్నాయన్నారు. అందుకే కర్ణాటక సరిహద్దు మండలాలలో కర్ణాటక వైద్యాధికారులతో కలిసి అనంత వైద్యాధికారులు అడ్డుకట్టకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా వైద్యాధికారి డాక్టర్ రమేష్, చిత్రదుర్గం జిల్లా వైద్యా ధికారి డాక్టర్ ప్రసాద్, తుమకూరు జిల్లా వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్, అనంత జిల్లా వైద్యాధికారి డాక్టరు ఈబీ దేవి, ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మా, డాక్టరు యుగంధర్, అనుపమ జేమ్స్, నారాయణస్వామి, శంషాద్‌బేగం, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్రా.. స్వచ్ఛ దివాస్



కలెక్టరేట్‌లో చెత్త ఊడుస్తున్న జేసీ, డీఆర్ఓ తదితరులు

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

స్థానిక కలెక్టరేట్‌లో శనివారం స్వచ్ఛ ఆంధ్రా- స్వచ్ఛదివాస్ కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టరు శివనారాయణశర్మ, డీఆర్ఓ మలోలతోపాటు కలెక్టరేట్‌లో వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు ఆవరణంలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. సెక్షన్ సూపరింటెండెంట్‌లు యుగేశ్వరి, రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఆర్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ కార్పొరేషన్ ఉద్యోగులు పెన్నార్ భవన్ ఆవరణలో శుభ్రం చేఆరు. ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయం ఆవరణంలోనూ శుభ్రం చేశారు. అలాగే అనంతపురంరూరల్ మండలంలోని గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్య కార్మికులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు పరిసరాలను స్వచ్ఛతా దివాస్ నిర్వహించా మండలకేంద్రమైన చెన్నేకొత్తపల్లిలో ఎంపీడీఓ శివశంకరప్ప ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈఓఆర్డీ అశోక్‌నాయక్, ఎంఈఓ-2 ప్రసూన్‌కుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి పంచాయతీ పరిధిలోని చిన్మయ్ నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. డీఎల్‌పీఓ లలితాబాయి, ఎంపీడీఓ విజయలక్ష్మి, టీడీపీ నాయకులు ఉప్పర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. శింగనమలలోఎంఈఓ నర సింహరాజు ఆర్యర్యంలో అధికారులు ర్యాలీ నిర్వహించారు. నార్పల మండలంలోని బొందలవాడ గ్రామంలో ఉప సర్పంచు ఆలం వెంకటనరసానాయుడు ఆధ్వర్యంలో ఆర్డీటీ స్కూల్ పరిసరాలలో శుభ్రం చేశారు. ఏపీడీ చెన్నకేశవులు, ఎంపీడీఓ గంగావతి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత విషయంలో కఠినంగా ఉంటాం

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్



చెత్తను సేకరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత విషయంలో ఇక నుంచి కఠినంగా ఉంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్రా - స్వచ్ఛ దివాస్‌లో భాగంగా శనివారం స్థానిక ఎర్రనేలకొట్టాలలో పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ముందుగా నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామితో కలిసి ఎమ్మెల్యే స్వయంగా ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించారు. మహాత్మాగాంధీ కాలనీలో ఆయుష్మాన్ సెంటర్ వద్ద మొక్కలు నాటారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. నాయకులు చంద్రమౌళి, బాబా ఫకృద్దీన్, రాజేంద్ర, రాజారావు, పోతుల లక్ష్మీనరసింహులు, పరమేశ్వ రన్, పీఎల్ఎన్ మూర్తి, సైఫుద్దీన్, చరిత, మారుతీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చదును చేసి.. అమ్మకానికి..!



వంకపోరం బోకు భూమిని చదును చేసిన దృశ్యం

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): చిన్నంపల్లి పంచాయతీ, కురుగుంట గ్రామ సర్వే నంబరు98-3లోని వంక పోరంబోకు భూమిని వైసీపీ నాయకుడు అమ్మేందుకు ప్రయత్నిస్తున్నా డు. మూడు ఎకరాలకుపైగా విస్తీర్ణాన్ని చదును చేసి అమ్మకానికి పెట్టాడు. ఆత్మకూరు మండలం తోపుదుర్తికి చెందిన వైసీపీ నాయకుడు తన బామరిదితో కలిసి ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నట్లు ఈ నెల 14న 'ఆక్రమించు.. విక్రయించు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో వారు భూమి విక్రయ ప్రక్రియ వేగం పెంచారు. అమ్మలేకపోతే.. గుడిసెలు వేసైనా విక్రయించాలని నిర్ణయించినట్లు సమాచారం. రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్య ధోరణి ఆక్రమణదారులకు ఆసరాగా మారింది. కాగా, ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మోహన్‌కుమార్ అన్నారు. భూమిని చదును చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని తెలిపారు.

వడ్డీ వ్యాపారి బెదిరిస్తున్నారు

● పోలీసులకు కోటంక మహిళ ఫిర్యాదు

గార్లదిన్నె, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారి తనను, తన భర్తను చంపేస్తామని బెదిరిస్తున్నారని కోటంక గ్రామానికి చెందిన చిన్న కుళ్ళాయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తీసుకున్న అసలు, వడ్డీ సహా భారీ మొత్తాన్ని చెల్లించామని, ఇంకా అప్పు ఉందని వేధిస్తున్నారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురంలో ఉన్న సమయంలో రాణినగర్‌కు చెందిన మణికుమార్ నుంచి రూ.10 వడ్డీకి రూ.1.50 లక్షలు అప్పుగా తీసుకున్నానని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారానికి రూ.15 వేలు చొప్పున రూ.3 లక్షలు చెల్లించినా.. ఇంకా డబ్బు ఇవ్వాలని మణికుమార్ గొడవ చేశారని, దీంతో బంగారాన్ని అమ్మి మరో రూ.65 వేలు ఇచ్చానని తెలిపారు. అయినా ఆగకుండా తన భర్త సురేష్‌రెడ్డిని బెదిరించి, 2024 జూలైలో రూ.5.30 లక్షలకు ప్రామిసరీ నోట్ రాయించుకున్నారని పేర్కొన్నారు. ఇంకా రూ.1.30 లక్షలు ఇస్తామని చెప్పినా వినడం లేదని, కోటంకలోని తమ ఇంటికి కిరాయి మహిళలను పంపి బెదిరించారని ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం తాను 9 నెలల గర్భిణిని అని, తన భర్త విధులకు వెళ్లిన సమయంలో వడ్డీ వ్యాపారి ఇంటికి వచ్చి బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త ఫొటోను సోషల్ మీడియాలో పెట్టి అవమానిస్తున్నారని, తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు. వడ్డీ వ్యాపారిపై చర్యలు తీసుకుంటామని బాధితురాలికి ఎస్ఐ భరోసా ఇచ్చారు.

నేడు హాకీ జట్టు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి హాకీ సీనియర్ పురుషుల క్రీడా జట్టు ఎంపిక పోటీలను స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం నిర్వహి స్తున్నట్లు హాకీ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి అనీల్‌కుమార్ తెలి పారు. ఆసక్తి, అర్హత ఉన్న క్రీడాకారులు హాజరుకావాలన్నారు. ఎంపికైన జట్టు మార్చి మొ దటి వారంలో గుంటూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ ఫోన్ నంబరు 9490033474ను సంప్రదించాలని కోరారు.

న్యూస్ బాక్స్

వైభవంగా ఆంజనేయస్వామి ప్రాకారోత్సవం


ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం రాత్రి స్వామివారి ప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామి వారి మూలవిరాట్టుకు బంగారుకవచం, వజ్రకిరీటాన్ని ధరింపజేసి పూజలు చేశారు. రాత్రి వెండి రథంలో స్వామివారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చారు. స్వామి వారికి పూజలు చేసి మేళతాళాల మధ్య ఆలయ ప్రాంగణంలో ప్రాకారోత్సవాన్నినిర్వహించారు. ఆలయ అధికారులు, వేదపండితులు, అర్చకులు, భక్తలు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం


రథోత్సవంలో భక్తులు

బెళుగుప్ప, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామసాగరం సమీపంలో పెన్నా నది ఒడ్డున వెలిసిన బూదిగుమ్మ ఆంజనేయస్వామి, వెంకటరమణస్వామి ఆలయాల్లో శనివారం రథోత్సవాన్ని నిర్వహించారు. గోపూజ, గంగపూజలు, పంచామృతాభిషేకం అలంకరణ, కుంకుమార్చన, పుష్పార్చన, గరుడస్తంభ దీపారాధన, సాయంత్రం రామసాగరం నుంచి బూదిగుమ్మ పుణ్యక్షేత్రానికి అర్చకులు జ్ఞానేశ్వర స్వామి పూజలు చేశారు. అనంతరం భక్తులు రథాన్ని లాగారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు కార్యనిర్వాహకాధికారి అక్కిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ యర్రిస్వామి తెలిపారు. రథోత్సవంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ


అలంకరణలో స్వామివారు

యాడికి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపేట ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను శనివారం ఘనంగా నిర్వహించారు. పచ్చారుమేకలపల్లి గ్రామ సమీపాన నూతనంగా నిర్మించిన ఆలయంలో మూడురోజుల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం స్వామివారి విగ్రహన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నారసింహుడికి పల్లకి సేవ


ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారికి పల్లకి సేవ కార్యక్రమాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి, పల్లకిలో కొలువు ఆలయ మాడవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. ఆలయసిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగపూజ


ఊరేగింపుగా వస్తున్న భక్తులు

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మైలారలింగస్వామి నూతన దేవస్థానం నిర్మాణం, విగ్రహావిష్కరణ మూడురోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం తెల్లవారుజామున ప్రత్యేక హోమాలు, విగ్రహాలకు పూజలు నిర్వహించినట్లు కమిటీసభ్యులు తెలిపారు. వందలాది మంది మహిళలు కలశాలతో స్వామివారిని దేవస్థానం నుంచి శాంతినగర్ పాలబావి వరకు ఊరేగించారు. బావిలో విగ్రహాలకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. మైలార, దేవరకొండ నుండి ప్రత్యేకంగా ఆహ్వానించిన వగ్గప్పలు, ఆనందప్ప, సంగన్న, కెంచప్ప, మల్లేషప్ప, సంగన్న, రవి, బసవంతప్పగార్లచే పాలబావి వద్ద విగ్రహాలకు ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు గిడ్డ సిద్ధప్ప, మండి సిద్ధప్ప, కౌన్సిలర్ పెద్ద వన్నూరప్ప, గోపినాథ్, కృష్ణ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు


అలంకరణలో ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ చార్యులు, సంతోష్‌కుమార్ చార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిర్మల్యవిసర్జన, విష్ణుపారాయణం, అష్టోత్తరం నిర్వహించి మూలవిరాట్‌కు పుష్పాలంకరణ చేసి నైవేద్యం సమర్పించిన అనంతరం మహామంగళహారతి ఇచ్చారు. దేవదాయశాఖ అధికారి ఓబన్న పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు కోచింగ్

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్ఆర్‌బీ పోటీ పరీక్షలకు కోచింగ్ తరగతులను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య తెలిపారు. శనివారం కళాశాలలో డిజిటల్ క్లాస్‌రూంను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కళాశాల అవర్స్ అయిపోయిన తరువాత మధ్యాహ్నం 3 నుంచి 5గంటల వరకు కోచింగ్ తరగతులను నిర్వహిస్తామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఓబులేసు, అధ్యాపకులు గోపినాయక్, శివకుమార్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం


కూడేరు: ఇప్పేరులో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు

ఉరవకొండ,ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని పీడిస్తున్న ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. పట్టణంలో మేజరు పంచాయతీ కార్యాలయం, డిగ్రీ కళాశాల, ఐటీఐ కళాశాలల ఆధ్వర్యంలో వేర్వేరుగా స్వచ్ఛంద్రా, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కళాశాలలో విద్యార్థులు చీపురు పట్టి చెత్తను ఊడ్చారు. వైస్‌ప్రిన్సిపాల్ మస్తానయ్య, వెంకటరాముడు, పరమేష్, ఆదినారాయణ, ఐటీఐ కళాశాల శిక్షణాధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు దుర్గాప్రసాద్, తిరుపతయ్య పాల్గొన్నారు.

గుత్తి:పట్టణంలోని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గుత్తి కోట వద్ద ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎల్లప్ప ఆధ్వర్యంలో స్వచ్ఛంద్ర స్వచ్ఛదివాస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆస్పత్రి ఆవరణలో పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ పేపర్లు, చెత్తచెదారాన్ని తొలిగించారు.

కూడేరు: అంగన్‌వాడీ కేంద్రంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి సూచించారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర, కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఏపీఓ తులసీప్రసాద్, సర్పంచు లలితమ్మ పాల్గొన్నారు.

శెట్టూరు: మండల ప్రత్యేకాధికారి ఆర్ సురేష్, ఎస్ఈఆర్‌డబ్ల్యూఎస్ రమేష్ నాయక్, ఎంపీడీవో రఘురామారావు, ఏఈ సురేంద్ర, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో యాటకల్లు గ్రామంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు కార్యక్రమంపై అవగాహన కల్పించారు.

కుందుర్పి : స్థానిక ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల్లో ఎంపీడీవో లక్ష్మీశంకర్, మండల విద్యాధికారి హెచ్ఎస్ తిప్పేస్వామి పరిసరాలు పరిశుభ్రం చేశారు. కోఆర్డినేటర్ నాగేంద్ర, కార్యదర్శి మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యాలయంలో పరిసరాలను శుభ్రం చేశారు. ఎంపీడీవో నందకిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ రఘురామమూర్తి మాట్లాడుతూ కళాశాల పనిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, బాబు పాల్గొన్నారు.

యల్లనూరు: మండలంలోని పలు కార్యాలయాల్లో శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ సంపత్ సిబ్బందితో కలిసి కార్యక్రమం నిర్వహించారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని పలు వార్డుల్లో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ నయీమ్ అహ్మద్ మట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు.

బొమ్మనహాళ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పల్లెలు పరిశుభ్ర వాతావరణంతో పాటు ఆహ్లాదకరమైన రీతిలో ఉంటాయని ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓపీఆర్డీ దాస్ అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద వారి కార్యక్రమాన్ని నిర్వహించారు.


బ్రహ్మసముద్రం: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చెత్త ఊడుస్తున్న అధికారులు

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ


ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎంపీ అంబికా, టీడీపీ నాయకులు

పామిడి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుంపల్లి గ్రామ అటవీ ప్రాంతంలో వెలసిన వీర ముసలమ్మ ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ శనివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రాతఃకాల పూజ, అభిషేకం, హోమాలు గర్తపూజ, యంత్ర ప్రతిష్ఠ, ధ్వజ ప్రతిష్ఠ, శిఖర కలశ ప్రతిష్ఠ, బింబ కళాన్యాసములు, బలి హరణం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదాన చేపట్టారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ ముసలిరెడ్డి, ఇల్లూరు రామాంజనేయులు, సోమనాథ్‌రెడ్డి, రాజు, శివశంకర్, రాజు, ఉదయ్ పాల్గొన్నారు.

చౌక బియ్యం పంపిణీ పరిశీలన

శెట్టూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని బచ్చేహళ్లి గ్రామంలో ప్రజలకు అందజేస్తున్న చౌక బియ్యం పంపిణీ వాహనాన్ని ఆర్డీవో వసంతబాబు తనిఖీ చేశారు. ప్రజలకు అందజేసే నిత్యావసర సరుకులు సక్రమంగా అందించాలని ఆదేశించారు.

లింగవివక్షపై అవగాహన కల్పించాలి

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో లింగవివక్షపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఆర్డీఓ శ్రీనివాస్ సూచించారు. స్థానిక కార్యాలయంలో శనివారం పీసీ పెన్డిటీ యాక్ట్ సబ్ డివిజనల్ లెవల్ అప్రాప్రియేట్ ఆథారిటీ కమిటీ, డివిజనల్ అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జడ్పీపాఠశాల, కేజీబీవీ, మోడల్ పాఠశాల విద్యార్థినులకు లింగవివక్ష, బాల్యవివాహాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. ఏఓ భూషణ్, వన్‌టౌన్ సీఐ మనోహర్, వైద్యులు సుజాత, అరుణ, హరిత, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల తనిఖీ

ఉరవకొండ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల, వజ్రకరూరులోని ఆస్పత్రులను కడప మలేరియా జోనల్ అధికారి లక్ష్మీనాయక్ శనివారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ల్యాబ్‌లను పరిశీలించి, హాజరు పట్టికను తనిఖీ చేశారు. ల్యాబ్‌లో ఎంత మంది రక్త నమూనాలు సేకరిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. వైద్యులు తేజ ప్రతిమ, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తేజేశ్వరి, ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి పాల్గొన్నారు.

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డ్వామా కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ వినోద్‌కుమార్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ ఆర్డీఓ అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నట్లు తెలిపారు. డ్వామా కార్యాలయంలో 9 నుంచి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ

ఉరవకొండ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని చాబాల గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణానికి టీడీపీ నాయకులు శనివారం భూమిపూజ చేశారు. రూ.8లక్షలతో మారెమ్మ దేవాలయం నుంచి హోతూరు రహదారి జజ్జిజీ సీసీ రోడ్డుతో పాటు డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నాయకులు ఎర్రిస్వామి, పంపాపతి, మహేష్, రాంబాబు, నాగరాజు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు అభినందన

గుత్తి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులను శనివారం కళాశాల యాజమాన్యం అభినందించింది. నంద్యాలలోని ఆర్‌జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగం విద్యార్థులకు ప్రవాహ 2కే 25 సంకల్ప 2కే 25 అనే జాతీయస్థాయి సదస్సు నిర్వహించారు. గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విద్యార్థులుప్రాజెక్టు ఎక్స్‌పో పోస్టర్ పేపర్ ప్రజంటేషన్‌లో ప్రథమ, ద్వితీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. కళాశాల కరస్పాండెంట్ పద్మావతమ్మ విద్యార్థులను అభినందించారు.

ఇసుక డంపులు సీజ్

డీ.హీరేహాళ్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇసుకను అక్రమంగా నిలువ చేసినడంపులను పోలీసులు శనివారం నాడు సీజ్ చేశారు. మండలంలోని ఓబుళాపురం గ్రామ పరిసర ప్రాంతాలలో ఒకచోట భారీ ఎత్తున ఇసుకను నిల్వచేసి అక్కడి నుంచి రాత్రిపూట టిప్పర్ల ద్వారా కర్ణాటక ప్రాంతానికి తరలించేందుకు ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో భాగంగానే ఓబుళాపురం పరిసర ప్రాంతాలలో రెండుచోట్ల ఇసుకను డంపు చేసి ఉన్న సమాచారం అందుకున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సిబ్బందితో డంపు ప్రాంతానికి వెళ్లారు. అక్కడ పరిశీలించి ఇసుక డంపును సీజ్ చేశారు. అనంతరం ఓబుళాపురం గ్రామానికి చెందిన బసవరాజు, నాగరాజు డంపును ఏర్పాటు చేసినట్లు గుర్తించి వారిపై కూడా కేసు నమోదు చేశామని, ఇసుకను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ టీడీపీ కార్యకర్త మృతి

పెద్దవడుగూరు/గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్షుంపల్లి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుంతకల్లు మండలం కదరంపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నరేష్ (32) అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. నరేష్ అవివాహితుడు. తండ్రి కదిరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

కందిపంట, పశుగ్రాసం దగ్ధం

పెద్దవడుగూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలికి గ్రామంలో నాగయ్య అనే రైతుకు చెందిన కందిపంట, సాంబశివుడు అనే రైతుకు చెందిన పశుగ్రాసానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో అగ్నికి ఆహుతై రూ.లక్ష నష్టం వాటిల్లింది. బాధిత రైతులు తెలిపిన మేరకు నాగయ్యకు చెందిన నాలుగు ఎకరాల పొలంలో పండిన కంది పంటను గ్రామ సమీపంలో ఉన్న కళ్లం దొడ్డిలో నిల్వ ఉంచడంతో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో కంది పంట పూర్తిగా దగ్ధం కాగా పక్కనే ఉన్న పశుగ్రాసం కూడా అగ్నికీలకలు దగ్ధమైందన్నారు.

బ్లాక్ సిగ్నలింగ్ సిస్టంతో ప్రమాదాలు దూరం

● డీఆర్‌ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ సిస్టం ద్వారా రైలు ప్రమాదాలు నియంత్రణలోకి వస్తాయని, సమయపాలన సాధ్యపడుతుందని డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా అన్నారు. శనివారం పట్టణంలోని డీఆర్‌ఎం కార్యాలయంలోని సమావేశ భవనంలో ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ సిస్టంపై రైల్వే లోకో పైలట్లకు అవగాహనపరిచే బుక్‌లెట్లను ఆవిష్కరించారు. డీఆర్‌ఎం మాట్లాడుతూ ఒకే దిశలో నడిచే రైళ్ల వెనుక వైపు నుంచి ఢీకొనకుండా ఈ ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ సిస్టం సహకరిస్తుందన్నారు. రైళ్ల సమయానికి నడిచేలా చేసి సకాలంలో గమ్యస్థానానికి చేరుకోవడానికి ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు. ఏడీఆర్‌ఎం సుధాకర్, ఎస్అండ్‌టీ అధికారులు పాల్గొన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి: ఆర్డీఓ

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అధికారులు చేపడుతున్న రీసర్వే పనులకు ప్రతి రైతు సహకరించాలని ఆర్డీఓ వసంతబాబు కోరారు. శనివారం మండలంలోని జుంజురంపల్లి పంచాయతీలో రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్న రీసర్వే పనులను ఆర్డీఓ పర్యవేక్షించారు. ఆర్డీఓ మాట్లాడుతూ సర్వే నెంబర్ వారీగా రీసర్వే చేపట్టినపుడు రెవెన్యూ అధికారులు తప్పనిసరిగా రైతులకు సమాచారాన్ని అందించాలన్నారు. తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి ఇంటి నిర్మాణం కూల్చివేత


ఇంటి నిర్మాణాన్ని కూల్చివేసిన దృశ్యం

తాడిపత్రి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌రెడ్డి నిర్మిస్తున్న ఇంటిని నిబంధనలు ఉల్లంఘించారని శనివారం మున్సిపల్ అధికారులు కొంతభాగాన్ని కూల్చివేశారు. రమేష్‌రెడ్డి తీసుకున్న ప్లాన్‌లో ఒక విధంగా నిర్మాణ సమయంలో మరో విధంగా ఉందని, దాదాపు 5అడుగుల మేర ఎక్కువగా ఉండడంతో తొలగించినట్లు మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ తెలిపారు.

సైబర్ నేరాలపై చైతన్యవంతులు కావాలి

ఉరవకొండ,ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు చైతన్యవంతులు కావాలని ఎస్ఐ జనార్దన్‌నాయుడు అన్నారు. పట్టణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపైన ఆటోల ద్వారా అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్, లోన్‌యాప్‌లకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్‌లు వస్తే 1930కి కాల్ చేయాలన్నారు. హెడ్‌కానిస్టేబుళ్లు అంజయ్య, జాఫర్, సిబ్బంది పాల్గొన్నారు.

యల్లనూరు: మండలంలో శనివారం సైబర్ నేరాలపై స్థానిక పోలీసులు గ్రామాల్లో అవగాహన కల్పించారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు కాల్‌చేయాలని వివరించారు. జంగంపల్లి, పాతపల్లి, వెన్నపూసపల్లి గ్రామాల్లో ఆటో ద్వారా టామ్‌టామ్ వేయించారు.

యాడికి: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ ఈరన్న సూచించారు. శనివారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రుణయాప్‌ల పట్ల జాగ్రత్తలు అవసరమని అన్నారు. ఏఎస్ఐ వెంకటేష్, హెడ్‌కానిస్టేబుల్ రంగనాయకులు పాల్గొన్నారు.

పుట్లూరు: సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకటనరసింహం అన్నారు. మండలంలోని కడవకల్లులో శనివారం ఆటోతో ప్రచారం ప్రారంభించి, అవగాహన కల్పించారు.

కూడేరు: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. శనివారం మండల కేంద్రంలో సైబర్ నేరాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రజల అకౌంట్ల నుంచి డబ్బులు కాజేస్తున్నారని, తెలియని ఫోన్లు వస్తే ఎటువంటి సమచారం ఇవ్వకూడదని ఏఎస్ఐలు రామానాయుడు, శివశంకర్ కోరారు. కానిస్టేబుళ్ల మహింద్ర, నరేష్ పాల్గొన్నారు.


యాడికిలో అవగాహన కల్పిస్తున్న సీఐ ఈరన్న

అశ్వత్థనారాయణ తిరునాళ్లకు ఏర్పాట్లు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న తాడిపత్రి మున్సిపల్ చైర్మన్

పెద్దపప్పూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అశ్వత్థ నారాయణస్వామి చక్రస్థాపన భీమలింగేశ్వరస్వామి మాఘమాసం సందర్భంగా మూడో ఆదివారం జరగనున్న తిరునాళ్ల ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. శనివారం సాయంత్రం సాంస్కృతిక కార్యకలాపాలతో వచ్చిన భక్తాదులకు ఏర్పాట్లు అంతేకాకుండా తిరుణాళ్లకు వస్తున్న భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మహిళలకు ప్రత్యేక స్నానగదులు ఆర్టీసీ అధికారులచే ప్రత్యేక బస్సులు ఏర్పాట్లు భారీ బందోబస్తు పోలీస్ బలగాలతో తిరునాళ్లకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున 2గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తారని ఆలయ ఈఓ తెలిపారు. తిరుణాలకు వస్తున్న భక్తులకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు పెద్దవడుగూరు సీఐ వెంకటసుబ్బయ్య, ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

రాష్ట్రాభివృద్ధిని విస్మరించిన కేంద్రం: సీపీఎం



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల్ సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీ అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున మండిపడ్డారు. శనివారం కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ స్థానిక వినాయక కూడలి నుంచి పాత మున్సిపల్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఏపీ పట్ల బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా నినదించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసే చర్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు నాగరాజు, మధు, తిమ్మరాజు, కృష్ణనాయక్, ఆంజనేయులు, తిప్పేస్వామి, ఎస్ఎఫ్ఐ వంశీకృష్ణ పాల్గొన్నారు.

శ్రీ విద్యారణ్య పాఠశాల ప్రారంభం


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్వామీజీ

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతగుంతకల్లులో శనివారం శ్రీ విద్యారణ్య ఇంగ్లీష్ మీడియం నూతన పాఠశాలను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగద్గురు శంకరాచార్య హంపి విరుపాక్ష విద్యారణ్య భారతి స్వామీజీ హాజరై పాఠశాలను ప్రారంభించారు. స్వామీజీ మాట్లాడుతూ చదువును నిర్లక్ష్యం చేయరాదన్నారు. పాఠశాల కరస్పాండెంట్ మంజుల వెంకటేష్, హెచ్ఎం కళావతి, బీజేపీ నాయకులు రాజేష్, హరీష్, చిరంజీవిరెడ్డి, కొలమిశేకన్న, రంగన్న, శ్రీదేవి, చక్రవర్తి,కేశవ, రవీంద్ర పాల్గొన్నారు.

పోయిన బంగారాన్ని అప్పగించిన పోలీసులు


బంగారు నగలను కవితకు అందిస్తున్న పోలీసులు

తాడిపత్రి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతకోటకు చెందిన కవితను రాయదుర్గంకు ఇచ్చి వివాహంచేశారు. ఆమె పుట్టింటికి వచ్చి ఆటోలో బస్టాండ్‌కు వెళుతుండగా మార్గమధ్యలో హ్యాండ్‌బ్యాగ్‌లో బంగారు నెక్లెస్, చైన్, సెల్‌ఫోన్, కొంతడబ్బులు ఉంచింది. బస్టాండ్‌కు వెళ్లి ఆటోకు బాడుగ ఇద్దామని హ్యాండ్‌బ్యాగ్‌ను చూసుకోగా బ్యాగ్ ఎక్కడో పడిపోయింది. వెంటనే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ సాయిప్రసాద్ సిబ్బందితో కలిసి ఎక్కడి నుంచి ఆటోలో బయలుదేరిందని ఆరాతీశారు. బ్యాగులో ఫోన్ ఉండటంతో వాటి ఆధారంతో బ్యాగును సేకరించారు. గంట వ్యవధిలోనే గాంధీకట్ట వద్ద సమీపంలో ఉండగా వాటిని తీసుకొని బాధితురాలికి అప్పగించారు.

కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి: మాజీ ఎమ్మెల్యే

గుంతకల్లు, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): పార్టీ శ్రేణులు ధైర్యంగా ఉండాలని, తాను అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి భరోసా ఇచ్చారు. వైద్య పరీక్షల అనంతరం గుంతకల్లుకు వచ్చిన ఆయన శనివారం ఉదయం వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన టీడీపీ తమ పార్టీ నాయకులపై కేసులుపెట్టి భయోత్పాతం సృష్టించాలని చూస్తోందన్నారు. ఎంపీల బలం ఉన్నందున రాష్ట్రానికి పెద్ద మొత్తాదులో నిధులు తెచ్చి సూపర్ సిక్స్ పథకాలను అమలుపరచాలన్నారు. ఫ్లయింగ్ మహబూబ్, పాటిల్ యుగంధర రెడ్డి, నూర్ నిజామి పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా వారోత్సవాలపై అవగాహన


ర్యాలీ ప్రారంభిస్తున్న ఆర్టీవో శ్వేతాబిందు

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ యువరాజు, ఆర్టీవో శ్వేతాబిందు హెల్మెట్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పోలీస్ స్టేషన్ నుంచి టీ సర్కిల్, వాల్మీకి సర్కిల్, ఆర్టీటీ ఆస్పత్రి మీదుగా పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. ఆర్టీవో మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు


రాతిదూలాన్ని లాగుతున్న ఎద్దులు

గుత్తిరూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం రెండు పళ్ల విభాగంలో నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీలు హోరా హోరీగా సాగాయి. పోటీలో 34 జతలు ఎద్దులు పాల్గొన్నాయి. పోటీలను గుమ్మనూరు నారాయణ ప్రారంభించారు. సత్యసాయి జిల్లా సీకేపల్లి మండలం పుల్లేటిపల్లికి చెందిన బత్తల బాస్కర్‌రెడ్డికి చెందిన ఎద్దులు 4462 అడుగులు లాగి మొదటి బహుమతి రూ.20 వేలు సాధించాయి. ప్రకాశం జిల్లా రాచెర్ల మండలం ఆకులేడుకు చెందిన విజయలక్ష్మినాయుడు ఎద్దదలు రూ.15 వేలు, కర్నూలు జిల్లా తుగ్గిలి మండలం జొన్నగిరికి చెందిన మస్తాన్ యాదవ్ మూడవ మహుమతి రూ.10 వేలు సాధించాయి. ఆలయ కమిటీ చైర్మన్ రంగస్వామిరెడ్డి యాదవ్, నాయకులు చిన్నరెడ్డి యాదవ్, రామచంద్ర, లక్ష్మీరంగయ్య పాల్గొన్నారు.